క్లుప్తంగా

జూపెడ ఐకేపీ కేంద్రం తనిఖీ

తిరుమలాయపాలెం: జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని జూపెడలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం తహసీల్దార్ సుధీర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధాన్యాన్ని నాణ్యతా ప్రమాణాలు ఉండేలా కేంద్రానికి తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధరతో పాటు బోనస్ పొందాలని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు నాణ్యత ప్రమాణాల ప్రకారం ధాన్యాన్ని సకాలంలో తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మెకానిక్ కుటుంబానికి ఆర్థిక సాయం

ఖమ్మంఅర్బన్: ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న మెకానిక్‌కు ఖమ్మం కార్పొరేషన్ టూవీలర్ మెకానిక్ యూనియన్ బాధ్యులు శనివారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఖమ్మంకు మెకానిక్ మద్దోజ్ భాస్కర్ అనారోగ్య సమస్యలతో విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో ఆయన కుటుంబ పోషణ కోసం యూనియన్ అధ్యక్షుడు వంగాల కొండల్‌రావు రూ.10వేలు అందించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మచారి, హమీద్, మురళి, శేషు, వెంకటేష్, నాగులు, మీరా, సత్యనారాయణ, ఉపేందర్, నరేష్, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కమిటీలో కేఎండీసీకి స్థానం


ప్రిన్సిపాల్ రమణరావు

ఖమ్మం రాపర్తినగర్: కాకతీయ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ అడ్వయిజరీ కమిటీ మెంబర్‌గా కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వీ.రమణారావు నియమితులయ్యారు. ఈ మేరకు కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కె. ప్రతాపరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. యూనివర్సిటీ పరిధిలో జరిగే కార్యక్రమాలకు తగు సూచనలు చేయనున్నారు. కాగా, కళాశాల చైర్మన్ ఎం. నిరంజన్‌రెడ్డి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కోటప్పరెడ్డిలు ప్రిన్సిపాల్‌ను అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని ఇల్లెందు క్రాస్ రోడ్ సబ్ స్టేషన్ కవిరాజ్‌నగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం ఉదయం 8:30 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–3 ఆపరేషన్ ఏఏఈ జి.వెంకన్న శనివారం తెలిపారు. దీంతో కవిరాజ్‌నగర్ రోడ్ నంబర్ 6 నుంచి 15 వరకు, విజన్ స్కూల్ ఏరియా, కోర్టు ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

గోల్‌తండాలో బొడ్రాయి ప్రతిష్ఠ వార్షికోత్సవం


నాభిశిల వార్షికోత్సవ వేడుకలో గ్రామస్తులు

తిరుమలయపాలెం: మండలంలోని గోల్‌తండా గ్రామంలో నాభిశిల ప్రతిష్ఠ మూడవ వార్షికోత్స వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశాక అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ జడల నగేష్, నాయకులు చీకటి శ్రీను, తిమ్మిడి వెంకట్, జడల రమేష్, షేక్ సైదా, మదార్, దావుద్, మాజీ సర్పంచ్ రంగా, రమేష్, వీరన్న, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	18	బచ్చలికూర	4
వంకాయ	26		20
బెండకాయ	30	పాలకూర	4
పచ్చిమిర్చి	40		20
కాకర	56	చుక్కకూర	3
బీట్‌రూట్	30		20
బీర	50	తోటకూర	4
దొండ	30		20
పొట్లకాయ	40	గోంగూర	4
చిక్కుడు	90		20
గోరుచిక్కుడు	46	మెంతికూర	3
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	40	కొత్తిమీర	1
ఆలుగడ్డ	26		30
చామగడ్డ	40	పుదీన	1
క్యారెట్	30		20
క్యాప్సికం	58	–ఖమ్మం వ్యవసాయం	

ఐక్యతే.. వారి బలగం!


ఆర్మీ జవాన్లను సన్మానిస్తున్న గ్రామస్తులు(ఫైల్)


ఉత్తమ ఫలితాలు సాధించిన వారిని అభినందిస్తున్న ఉద్యోగులు(ఫైల్)

సండే స్పెషల్

అభివృద్ధే అజెండా.. గోరీలపాడుతండా

- గ్రామాభివృద్ధికి ప్రత్యేక కమిటీలు
- ఉద్యోగులందరితో సహకార సంఘం ఏర్పాటు
- ఆదర్శంగా నిలుస్తున్న తండావాసులు

కూసుమంచి: మండల కేంద్రానికి మారుమూల గ్రామంగా ఉన్న గోరీలపాడుతండా గ్రామస్తుల ఐక్యతతో అభివృద్ధి బాటలో సాగుతోంది. వారి అభివృద్ధికి వారే బాటలు వేసుకుంటున్నారు. ఈ తండాలో వందలాది మంది ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తుండగా.. వారందరు కలిసి మరికొంత మందిని చదువుల్లో ప్రోత్సహిస్తున్నారు. వారికి ఉద్యోగ బాట చూపుతున్నారు. గ్రామాభివృద్ధియే అజెండాగా ముందుకు సాగుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తుంది.


యువతి వివాహానికి ఆర్థిక సాయం అందిస్తున్న గ్రామస్తులు(ఫైల్)

185 మంది ఉద్యోగులు..

గోరీలపాడుతండాలో 476 కుటుంబాలు ఉండగా.. 1987 మంది జనాభా ఉన్నారు. ఈతండా ఒకప్పుడు వ్యవసాయానికే పరిమితం కాగా.. రాను రాను తండా యువకులు కష్టపడి చదువుకుని నేడు పలు రంగాల్లో స్థిరపడ్డారు. మొత్తం 185 మంది ఉద్యోగుల్లో 90 మంది ప్రభుత్వ ఉద్యోగులే కావడం విశేషం. వీరిలో ఆరుగురు ఇతరదేశాల్లో సాఫ్ట్‌వేర్‌లుగా స్థిరపడగా.. మరో ఇద్దరు ఓఎన్‌జీసీ, బీఎస్‌ఎన్‌లో జనరల్ మేనేజర్‌స్థాయిలో ఉన్నారు.

అభివృద్ధి కమిటీలు..

గ్రామాభివృద్ధి చెందాలంటే ఎవరో వస్తారు.. ఏదో చేస్తారు అని చూడకుండా గ్రామస్తులే అభివృద్ధి కమిటీలు వేసుకున్నారు. దీనిలో భాగంగా గోరీలపాడు గ్రామాభివృద్ధి కమిటీ (జీఓడీఎస్), గోరీలపాడుతండా ఉద్యోగుల సహకార సంఘం (జీఓఈఎస్) అనే రెండు కమిటీలను ఎన్నుకున్నారు. గ్రామాభివృద్ధి కోసం జీఓడీఎస్ కమిటీ కృషి చేస్తుంటే.. ఉద్యోగులందరూ తమవంతు సాయం అందించటంతో పాటు గ్రామంలోని యువతీ, యువకులను ఉన్నత చదువులు చదివించి ఉద్యోగాల్లో స్థిరపడేలా చేసేందుకు జీఓఈఎస్ కమిటీ ద్వారా కృషి చేస్తున్నారు. ఈ కమిటీల ద్వారా గ్రామ అభివృద్ధి, విద్య, వైద్యం, ఉపాధికి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు పేదలకు ఆసరాగా నిలుస్తున్నారు. ఇక తండావాసులు ఐక్యంగా ఉంటూ రామాలయం, సీతమ్మతల్లి ఆలయాలను విరాళాలతో నిర్మించుకోగా ప్రభుత్వ పరంగా అందే నిధులతో గ్రామాన్ని ఆదర్శంగా నిలిపేలా మరింత అభివృద్ధి చేసుకుంటున్నారు.

వీరితో పాటు 21 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు, 18 మంది పోలీస్ ఉద్యోగులు, ఆర్మీలో మరో ముగ్గురు ఉద్యోగాలు, మరికొంత మంది ఇతర రంగాల్లో రాణిస్తున్నారు. వీరిని ఆదర్శంగా తీసుకున్న యువతీ, యువకులు విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నారు. తండాలో ప్రస్తుతం 10 మంది విద్యార్థులు ప్రతిష్టాత్మక ఐఐటీలో, మరో ఆరుగురు ఎన్ఐటీల్లో విద్యను అభ్యసిస్తున్నారు. ఇక ఇంజనీరింగ్, మెడిసిన్ లాంటి కోర్సుల్లో పలువురు ఉన్నారు.

రాజకీయంలోనూ..

ఇక తండా విద్య,ఉద్యోగాలతో పాటు రాజకీయంగా చైతన్యం పొందుతుంది. తండా నుంచి బానోత్ శ్రీనివాస్‌నాయక్ తాజా మాజీ ఎంపీపీ కాగా మండలంలో తొలి ఎస్టీ ఎంపీపీ పదవి కూడా ఈ తండాకే దక్కింది. ఇక తండాలో రాజకీయాలు ఉన్నప్పటికీ అందరూ గ్రామాభివృద్ధికే ప్రాధాన్యత ఇస్తుండడంతో గత సర్పంచ్‌ను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకుని ఆదర్శంగా నిలిచారు.

రాజకీయాలకు అతీతంగా..



గోరీలపాడుతండాను రాజకీయాలకు అతీతంగా అన్ని విధాలుగా అభివృద్ధిలో నడిపేందుకు అందరం కలిసి కృషి చేస్తున్నాం. తండాలో అన్ని మౌలిక వసతులు కల్పించాలి. గ్రామస్తులంతా హాయిగా జీవనం సాగించాలనేది మా లక్ష్యం.

– బానోత్ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ

ఆదర్శంగా నిలుపుతాం..



ఊరందరం ఒకే మాటపై ఉంటూ మా గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తున్నాం. ముఖ్యంగా యువత విద్యాపరంగా రాణించేందుకు, గ్రామస్తులకు మెరుగైన వైద్యసదుపాయం, పేదలు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తున్నాం.

– తేజావత్ రాంకోటి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు

వినతుల వెల్లువ..

● ఎంపీకి న్యాయవాదుల వినతి


ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

ఖమ్మంలీగల్: 35 బీఎన్‌ఎస్‌ఎస్/41ఏ సీఆర్‌పీసీ, అడ్వకేట్ అమెండమెంట్ డ్రాఫ్ట్ బిల్ సవరణ చేయాలని కోరుతూ ఖమ్మం వచ్చిన పార్లమెంట్ సభ్యుడు రఘునందన్‌రావుకు సహస్ వెల్ఫేర్ ట్రస్ట్ నిర్వాహకులు, అడ్వకేట్ తాళ్లూరి దిలీప్ చౌదరి వినతిపత్రం అందజేశారు. సెంట్రల్ నోటరీలో తెలంగాణకు చెందిన 1,900 మంది నిరీక్షణలో ఉన్నారని, వారందరికీ అపాయింట్‌మెంట్ ఇవ్వాలని కోరారు. న్యాయవాదులు కొలిపాక శ్రీదేవి, పసుపులేటి శ్రీనివాసరావు, తెల్లాకుల రమేష్, యుగంధర్, కష్టారావు, సురేష్, మల్బూరు పాల్గొన్నారు.

● సూపరింటెండెంట్‌కు టీపీటీఎఫ్..

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయుల మెడికల్ బిల్లుల స్క్రూట్నీని తక్షణమే చేపట్టాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్, జిల్లా కార్యదర్శి వెంగళరావులు కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా మెడికల్ బోర్డు సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎక్కువ మొత్తంలో వైద్య ఖర్చులకు అయిన బిల్లులను పరిశీలించి మంజూరు చేయాలని, తదితర సమస్యలను విన్నవించి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, భావసన్, దామోదర్ పాల్గొన్నారు.

● ఎంపీడీఓకు..

కూసుమంచి: అర్హులైన పేదలకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరుతూ దళిత బహుజన నాయకుడు కొమ్ము ప్రసాద్ శనివారం ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పేదలకు న్యాయం జరిగితేనే పేదల ప్రభుత్వం ఇందిరమ్మ ప్రభుత్వం అవుతుందన్నారు. గ్రామాల్లో రాజకీయాలను అడ్డుపెట్టుకుని కొందరు ధనవంతులకు కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతున్నాయని, ఒకే ఇంట్లో ఇద్దరికి ఇళ్లు ఇస్తున్నారని, ఇటువంటి వాటిని గుర్తించి అనర్హులను జాబితా నుంచి తొలగించాలని అధికారులను కోరారు.

17న కార్పొరేషన్ కార్యాలయ ముట్టడి


సమావేశంలో మాట్లాడుతున్న విక్రమ్

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం కొన్నేళ్లుగా పేదలకు కొత్త పెన్షన్లు, రేషన్ కార్డులు, ఇంటి స్థలాలు ఇవ్వడం మర్చిపోయిందని, పోరాటాలు చేస్తేనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ అన్నారు. శనివారం నగరంలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్ఎస్‌టీ, పీఎస్ఆర్, రైల్వేస్టేషన్, డిపో, కిల్లా రోడ్లు విస్తరించాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంతో నగరంలో ట్రాఫిక్ సమస్య బాగా పెరిగిందని విమర్శించారు. పారిశుద్ధ్యం, శ్మశాన వాటికలు, వీధిలైట్లు, డ్రెయినేజీ వ్యవస్థ, బస్తీ దవాఖానాలు, వంతెనలు, కోతులు, కుక్కల బెడద తదితర ప్రజా సమస్యలు ప్రజలను తీవ్ర ఇబ్బంది పెడుతున్నాయని ఆరోపించారు. ప్రజా సమస్యలపై సర్వేలు నిర్వహించి ఈ నెల 17న ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఎస్‌కె.మీరా సాహెబ్, అర్బన్ మండల కార్యదర్శి ఉపేందర్, కృష్ణయ్య, నాగేశ్వరరావు, జనార్ధన్, వెంకన్న, మధు, జాన్ బి తదితరులు పాల్గొన్నారు.

14న సీపీఐ ఆధ్వర్యాన..

ఖమ్మం నగర సమస్యల పరిష్కారం కోసం ఈనెల 14న కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించనున్నట్లు సీపీఐ నాయకుడు జానిమియా తెలిపారు. శనివారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పించాలని, అర్హులకు పథకాలు అందించాలనే డిమాండ్‌తో ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో కార్పొరేటర్ బీజీ క్లైమెంట్, నాయకులు పోటు కళావతి, మేకల శ్రీనివాసరావు, పగడాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధ జయంతిని జయప్రదం చేయండి


సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఈ నెల 12న నేలకొండపల్లిలోని బౌద్ధస్తూపం వద్ద బౌద్ధ జయంతి సభను జయప్రదం చేయాలని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ పాల్వంచ రామారావు కోరారు. శనివారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నేలకొండపల్లిలోని బౌద్ధ స్తూపాన్ని టూరిస్ట్ ప్రాంతంగా తీర్చిదిద్దాలని, అప్పుడే బుద్ధుడి చరిత్ర తెలుసులుందన్నారు. బుద్ధుడి అడుగుజాడల్లో నడిచే దేశాలు శాంతిని కోరుకుంటున్నాయని పేర్కొన్నారు. టీవీ.రాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బౌద్ధ నాయకులు రామకృష్ణ, బీసీ జేఏసీ నాయకులు చిట్టోజు రమేష్, జి.కోటేశ్వరరావు, ఎలగందుల రాధాకృష్ణ, రాంబాబు తదిరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


చెక్కు అందిస్తున్న మార్కెట్ చైర్మన్ సీతారాములు

నేలకొండపల్లి: రాష్ట్రప్రభుత్వం పేదల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని నేలకొండపల్లి మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు తెలిపారు. మండల కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు శనివారం ఆయన చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సిఫారసుతో పలువురికి సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందుతోందని తెలిపారు. అలాగే, కోనాయిగూడెంలో వధూవరులు నాగరాజు–మమతకు మంత్రి పొంగులేటి తరపున పట్టువస్త్రాలను మార్కెట్ చైర్మన్ సీతారాములు అందజేశారు. ఈకార్యక్రమాల్లో నాయకులు శాఖమూరి రమేష్, జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, పెంటమళ్ల పుల్లమ్మ, కొమ్మినేని పుష్పావతి, వెంకన్న, బొందయ్య, జెర్రిపోతుల సత్యనారాయణ, కడియాల నరేష్, లక్కం ఏడుకొండలు, గురవయ్య, చిట్యాల రమేష్, తేజావత్ శివాజీ, కొచ్చెర్ల శ్రీనివాసరావు, కొమ్మినేని శ్రీదేవి, పాకనాటి కన్నారెడ్డి, మేకల అర్జున్, వెంకటరెడ్డి, పగడాల సైదులు, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

'నాగస్వరం' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ వెంకన్న

ఖమ్మంగాంధీచౌక్: దళిత మూలాలున్న నాగజాతిపై కవి కోయి కోటేశ్వరరావు రాసిన 'నాగస్వరం'కవితా సంపుటి(పుస్తకం)ని ప్రముఖ వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, కవి విమర్శకులు గుంటూరు లక్ష్మీనరసయ్య, న్యూ ఇరా విద్యా సంస్థల అధినేత ఐవీ రమణారావులు ఆవిష్కరించారు. నగరంలోని న్యూ ఇరా పాఠశాలలో శనివారం రాత్రి జాషువా సాహిత్య వేదిక ఆధ్వర్యాన కార్యక్రమం నిర్వహించగా.. పుస్తక రచయిత కోటేశ్వరరావును ఎమ్మెల్సీ అభినందనలు తెలిపారు. సమాజ చైతన్యానికి కవిత్వం ఎంతగానో దోహదపడుతుందని ఆయన అభివర్ణించారు. పగిడిపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు కవులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

కూసుమంచి: మండలంలోని కేశ్వాపురంలో శనివారం మధ్యాహ్నం మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగులు లాక్కెళ్లారు. గ్రామానికి చెందిన బెల్లం సావిత్రి మెయిన్‌రోడ్డులో ఇంటి ముందు నిలబడగా, ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చారు. బైక్ నడిపే వ్యక్తి చిరునామా ఆరా తీస్తుండగా, వెనకాల కూర్చున్న వ్యక్తి సావిత్రి మెడలోని బంగారు గొలుసు లాక్కొగానే పారిపోయారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

కూసుమంచి: మండలంలోని బండమీదితండా వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చింతలతండా, హట్యాతండా గ్రామాలకు చెందిన బదావత్ లింగా, బదావత్ మాన్‌సింగ్‌లు ద్విచక్రవాహనంపై చౌటపల్లి నుంచి వస్తుండగా.. బండమీదితండా వద్దకు రాగానే ఎదురుగా కూల్ డ్రింక్స్ లోడుతో వస్తున్న ట్రాలీ ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు 108లో ఖమ్మంకు తరలించారు. ఈఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

50 కిలోల బియ్యం వితరణ

రఘునాథపాలెం: చిమ్మపూడికి చెందిన పోతం నారాయణమ్మ ఇటీవల మృతి చెందగా, ఆమె కుటుంబానికి మాజీ ఉపసర్పంచ్ శనివారం 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నారాయణమ్మ కుటుంబీకులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు సౌకర్యాలు కల్పించాలి


కూలీలతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఖమ్మంరూరల్: ఉపాధి పని ప్రదేశాల్లో కూలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు ప్రతాపనేని వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని కామంచికల్‌లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి కేరళ తరహాలో పనిదినాలు కల్పించి రోజుకు రూ.600 కూలి ఇవ్వాలన్నారు. సమస్యల సాధనకు ఈ నెల 2న జరిగే మండల కార్యాలయ ముట్టడిని, 30న జరిగే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకమ్మ, గుండ్ర రామస్వామి, యాసరపు వెంకన్న, లక్ష్మి, కరుణ, కూలీలు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో అనర్థాలు

తిరుమలాయపాలెం: మాదక ద్రవ్యాలతో యువత బానిసలవుతున్న తరుణంలో సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల జిల్లా పరిషత్ తెలుగు ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ శనివారం వినూత్న రీతిలో ప్రచారం నిర్వహించాడు. మండలంలోని పిండిప్రోలు సంతలో ఫ్లెక్సీలు, కరప్రతాలు ప్రదర్శించి మైక్ ద్వారా ప్రచారం చేశాడు. యువతను సన్మార్గంలో నడిపించేందుకు తన వంతుగా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. మత్తుకు బానిస కావొద్దని కోరారు.

విద్యార్థులకు ఉద్యోగాలు

ఖమ్మం సహకారనగర్: తమ కళాశాలకు చెందిన 16 మంది విద్యార్థులు జెన్నీ ల్యాబ్స్, స్మార్ట్ బ్రైట్స్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికై నట్లు ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఇటీవల ప్లేస్‌మెంట్స్ నిర్వహించగా.. శనివారం విద్యార్థులకు ఆఫర్ లెటర్స్ అందించి అభినందించారు. అకడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, శివ ప్రసాద్, రవీంద్రబాబు, శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, కంపెనీ బాధ్యులు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

9 నెలల తర్వాత కుటుంబం చెంతకు..


కుటుంబీకులతో ప్రవీణ్, ఫౌండేషన్ బాధ్యులు

ఖమ్మం అర్బన్: మతిస్థిమితం కోల్పోయిన ఓ వ్యక్తి తొమ్మిది నెలల తర్వాత తన కుటుంబం చెంతకు చేరుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. సుమారు 40ఏళ్ల వయసున్న ఓ మతిస్థిమితం లేని వ్యక్తి ఖమ్మం వైరా రోడ్డులోని నూతన కలెక్టర్ కార్యాలయం సమీపాన రాత్రి వర్షంలో తడుస్తూ తలకు గాయాలైన స్థితిలో పడి ఉండగా.. పోలీసుల సమాచారం అన్నం ఫౌండేషన్ బాధ్యులు చికిత్స అందించి ఫౌండేషన్‌లో ఆశ్రయం కల్పించారు. కోలుకున్న అనంతరం తన పేరు కాలేరు ప్రవీణ్ అని, మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం చెట్ల ముప్పారం గ్రామానికి చెందిన వాడినని, తండ్రి కాలేరు రాజయ్య, తల్లి విజయలక్ష్మి, ముగ్గురు అక్కచెల్లెలు ఉన్నారని చెప్పాడు. దీంతో ఫౌండేషన్ బాధ్యులు అంబులెన్స్‌లో స్వగ్రామానికి తీసుకెళ్లగా.. ఆయన తల్లిదండ్రులు అనారోగ్య నిమిత్తం వరంగల్‌కు వెళ్లడంతో బాబాయ్ అయిన కాలేరు వీరేశంకు అప్పగించారు. కాగా, గత వర్షాకాలంలో ఇంటి నుంచి తప్పిపోయాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక


బాధ్యతలు అప్పగిస్తున్న ప్రస్తుత కమిటీ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం గ్రేట్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఖమ్మంలోని క్లబ్ కార్యాలయంలో ప్రస్తుత క్లబ్ అధ్యక్షుడు పెసర ప్రభాకర్‌రెడ్డి సమక్షాన ఎన్నుకున్నారు. నూతన క్లబ్ అధ్యక్షుడిగా అడ్వకేట్ కన్మంతరెడ్డి ఉపేందర్‌రెడ్డి, కార్యదర్శిగా డాక్టర్ శీలం నరేన్‌రెడ్డి, కోశాధికారిగా సంకు నాగిరెడ్డిలు ఎంపికయ్యారు. తొలుత నిర్వహించిన సమావేశంలో కార్యదర్శి నాగిరెడ్డి వార్షిక నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి కార్యవర్గం అందించిన 12 రకాల సేవా కార్యక్రమాలను వివరించాక సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చల్లా ప్రతిభారెడ్డి, కొత్త సత్యనారాయణరెడ్డి, దామ స్వరూప, పెద్దపల్లి సుధాకర్, వెంకట్రామిరెడ్డి, శ్యామల శ్రీనివాసరెడ్డి, దగ్గుల మాధవరెడ్డి, నాగమణి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యపై అవగాహన

ఖమ్మం సహకారనగర్: నగరంలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో రాజ్ అబ్రాడ్ కన్సల్‌టెన్సీ ఆధ్వర్యాన విదేశీ విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్య, ఉద్యోగ అవకాశాలు, వివిధ యూనివర్సిటీల్లో అడ్మిషన్లు, స్కాలర్‌షిప్స్ పొందే విధానం, తదితర అంశాలను కన్సల్‌టెన్సీ అధినేత్ రాజ్ చెన్నా వివరించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి రంగారావు, నాయకులు అమృతకుమార్, రంగారావు, జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

ఖమ్మం మామిళ్లగూడెం: పేద ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్వర్గీయ ముప్పల తులసిదాస్ జ్ఞాపకార్థం దేవకి ఫౌండేషన్ ఆధ్వర్యాన చలివేంద్రాలను ఫౌండేషన్ అధినేత, బీజేపీ జిల్లా నాయకుడు దేవకి వాసుదేవరావు దంపతులు శనివారం ప్రారంభించారు. నగరంలోని త్రీటౌన్ ప్రాంతం వ్యవసాయ మార్కెట్ వద్ద, 33వ డివిజన్ గాంధీనగర్‌లో ప్రారంభించడంతో పాటు మజ్జిగ కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు పిట్టల వెంకటనర్సయ్య, లక్ష్మీనారాయణ గుప్త, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

భారత సైన్యానికి మద్దతుగా సంఘీభావ ర్యాలీ


ప్రదర్శన చేస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, సభ్యులు

ఖమ్మంగాంధీచౌక్: భారత సైన్యం వీరోచిత పోరాటానికి మద్దతుగా ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి వర్గం ఆధ్వర్యాన శనివారం రాత్రి నగరంలో ర్యాలీ నిర్వహించారు. త్రీటౌన్ చాంబర్ ఆఫ్ కామర్స్ నుంచి పురవీధుల గుండా గాంధీచౌక్ సెంటర్ వరకు ర్యాలీ తీసిన ప్రదర్శకారులు భారత సైనికుల పోరాటాన్ని హర్షిస్తూ నినాదాలు చేశారు. పాకిస్తాన్ ఉగ్రదాడులను నిరసించారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం, మిర్చి శాఖ అధ్యక్ష, కార్యదర్శులు మాటేటి నాగేశ్వరరావు, యడ్లపల్లి సతీష్‌కుమార్, కోల్డ్ స్టోరేజీ శాఖ అధ్యక్షులు మలివెట్టి వెంకటేశ్వర్లు, పాయల నాగేశ్వరరావు, జంగిలి రమణ, లక్ష్మీనరసింహారావు, లక్ష్మయ్య, కృష్ణ, పాపారావు, వెంకటేశ్వర్లు, శేషగిరిరావు, భాస్కర్‌రావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.